ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
గురువారం 13 మార్చి 2025

కాజేసి.. కట్టేశారు..!

జగనన్న కాలనీలో సంపన్నుల భవనాలు

- కుణుతూరు లే అవుట్‌లో భారీ అక్రమాలు
- వైసీపీ నాయకులు, అనుచరులకు పందేరం
- అధికారులతో కుమ్మక్కై, పట్టాల పంపిణీ
- బడాబాబులకే జగనన్న ఇళ్లు



● ఈ ఫొటోలో ఉన్నది కుణుతూరు గ్రామంలో గోవిందరెడ్డి ఇల్లు. ఇంతపెద్ద ఇల్లు ఉన్న గోవిందరెడ్డి కుమారుడు కె.రాజశేఖర్‌రెడ్డికి జగనన్న లే అవుట్‌లో ఆయన భార్య శ్రీవాణి పేరిట పట్టా నంబర్ ఏఎస్‌ఏ 01958901తో 112 ప్లాట్‌తో ఇంటి స్థలం ఇచ్చారు.



● కుణుతూరుకు చెందిన కులశేఖర్‌రెడ్డికి ధర్మవరం పట్టణంలో మూడిళ్లు ఉన్నాయి. సొంతూరులోనూ భవనం ఉంది. అయినా ఆయన భార్య టి.వాణి పేరుమీద ఏఎస్‌ఏ 01884339 నంబర్‌తో 26వ ప్లాట్ పట్టా ఇచ్చారు. వీటితో పాటు పక్కనున్న 27వ ప్లాట్‌ను కూడా అక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు.



● ఈ ఫొటోలోని ఇల్లు కుణుతూరు జగనన్న లే అవుట్‌లోని 131 ప్లాట్‌లో నిర్మించినది. ధర్మవరం పట్టణానికి చెందిన దుర్గాసులకు చెందినది. ఈయన బేల్దారి. ఈయనకు ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌లో రెండు భవంతులు ఉన్నాయి. ఈయన ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడికి చెందిన భవనాలను నిర్మించారు. నిర్మాణ పనులకు నగదు తక్కువ తీసుకోవడంతో ఇంటి పట్టాను కానుకగా ఇచ్చినట్లు ప్రచారం ఉంది. ఆయన దర్జాగా భారీ ఇంటిని నిర్మించుకున్నారు.





ఈ ఫొటోలో ఉన్నది కుణుతూరు జగనన్న లే అవుట్‌లోని ప్లాట్ నంబర్ 91లో నిర్మించిన ఇల్లు. అదే గ్రామానికి చెందిన పాటిల్ ప్రదీప్‌రెడ్డిది. ప్రదీప్‌రెడ్డి, ఆయన భార్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. పేదల పేరిట పట్టాలు ఇవ్వడంతో ఇంటి నిర్మాణం చేపట్టారు.

ధర్మవరం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆ కాలనీలోకి వెళితే ఏసీలు అమర్చిన ఇళ్లు కనిపిస్తాయి. పలురకాల డిజైన్లతో కూడిన భవంతులు దర్శనమిస్తాయి. అదేదో గేటెడ్ కమ్యూనిటీ అనుకుంటే పొరపాటే. అవి కుణుతూరు వద్ద జగనన్న లే అవుట్‌లోని ఇళ్లు. పేదలకు ఇవ్వాల్సిన పట్టాలు పెద్దలకు ఇవ్వడంతో ప్రస్తుతం ఆ కాలనీని ధనవంతుల కాలనీగా పిలుచుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు నిదర్శనం ఈ కాలనీ. పేదల పేరుతో పార్టీ కార్యకర్తలు, నాయకులకు పట్టాలను పంచేశారు. వాటిని కొందరు అమ్ముకోగా.. మరికొందరు భారీ భవంతులను నిర్మించుకున్నారు.

తండ్రి పేరిట..!

కుణుతూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజేశ్వరి తండ్రి ఎన్.వెంకటేష్ పేరుమీద ఇంటి పట్టా ఇచ్చారు. వీరిది పోతుకుంట గ్రామం. కుణుతూరు గ్రామానికి ఎలాంటి సంబంధం లేకున్నా, వైసీపీ నాయకుడు చేసిన పనులకు బిల్లులు చేయడంతో బహుమానంగా పట్టాను ఇచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోని పాఠశాల ఆవరణంలో ఆర్‌బీకే, సచివాలయ నిర్మాణం చేపట్టగా.. అదే గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. వీటిపై కోర్టులో ఉండగా బిల్లులు మంజూరు చేయడంతో అందుకుగాను పట్టాను ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. 2021లో అదేప్లాట్‌లోనే కుణుతూరు గ్రామానికి చెందిన ఉప్పర తులసికి కూడా ఇంటి పట్టా ఇచ్చారు. ఒకరికి బుక్‌ద్వారా పట్టా ఇచ్చారు, వెంకటేష్‌కు మాత్రం మ్యానువల్ పద్ధతిలో ఇచ్చారు. ఇలా ఒకే ప్లాట్‌కు రెండు పట్టాలు ఇచ్చారు.

పట్టాలే పట్టాలు

కుణుతూరు పంచాయతీలో 167 మందిని అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మామిళ్లపల్లి-ధర్మవరం ప్రధాన రహదారికి అనుబంధంగా లే అవుట్ వేశారు. అక్కడ స్థలాలు రూ.లక్షలు విలువ చేయడంతో వైసీపీ నాయకులు తమ అనుచరులకు, కావలసిన వారికి అప్పనంగా కట్టబెట్టారు. కుణుతూరు పొలం సర్వే నంబర్ 382-1, 387-1, 388-1, 389-1, 406-4బీలో స్థలాలు కేటాయించారు. ముందు లే అవుట్‌లో అప్పటి ఎమ్మెల్యే చేతులమీదుగా 30 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన పట్టాలను ఆ పంచాయతీకి చెందిన వైసీపీ ముఖ్య నాయకుల కనుసన్నల్లో పంపిణీ చేపట్టారు. కొంతమందికి పట్టాలు పంపిణీ చేయకుండానే ఇళ్లు నిర్మించుకోవాలని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే జగనన్న లేఅవుట్‌లోని అనర్హులను గుర్తించాలని అధికారులు విచారణ చేపట్టారు. ఇళ్లు నిర్మించుకున్న వారివద్ద పట్టాలు లేవు. ఆ పట్టాలు ఓ వైసీపీ నాయకుడి వద్ద ఉన్నాయని లబ్ధిదారులు చెప్పడంతో అధికారులు అవాక్కయ్యారు.

వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే..

కుణుతూరు జగనన్న లే అవుట్‌లో కుణుతూరు, కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి గ్రామస్థులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని అప్పట్లో అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ గ్రామ పంచాయతీకి చెందిన ఆ ఇద్దరి వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే పట్టాలను పంపిణీ చేశారు. తమ అనుచరులు, అయినవారు, బడాబాబులకు పట్టాలను రాసిచ్చేశారు. ఆ నాయకులు తమ సామాజిక వర్గానికే ఎక్కువగా పంపిణీ చేసినట్లు ఆ గ్రామస్థులు చెబుతున్నారు.



విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

అనర్హుల పట్టాలు రద్దుచేస్తారా..?

కూటమి ప్రభుత్వం రాగానే జగనన్న లే అవుట్‌లో ఇచ్చిన ఇళ్ల పట్టాలపై విచారణ ప్రారంభించారు. కుణుతూరు జగనన్న లే అవుట్‌లో విచారించిన అధికారులు అనర్హులను చూసి విస్తుపోయారు. 167 మందిలో 100 మంది దాకా విచారణకు వచ్చారని, మిగిలిన వారు విచారణకు ససేమిరా అంటున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇంతమంది అనర్హులకు పట్టాలు ఎలా ఇచ్చారని విచారణ సందర్భంగా అధికారులే విస్తుపోయినట్లు సమాచారం. కొంతమంది పట్టాలు వైసీపీ నాయకుడి వద్ద ఉన్నాయని అధికారుల ఎదుట వాపోయారు. తప్పనిసరిగా పట్టాలు తీసుకుని రావాలని లేని పక్షంలో రద్దు చేస్తామని తెలడంతో లబ్ధిదారులు కంగారుపడుతున్నారు. విచారణకు హాజరైతే ఎక్కడ తమ బండారం బయటపడుతుందోనని బడాబాబులు చాలామంది రాలేదని తెలుస్తోంది.

గుడి, బడి, అంగన్‌వాడీ స్థలాలు కూడా..

కుణుతూరు లేఅవుట్‌లో గుడి, బడి, అంగన్‌వాడీ కేంద్రానికి స్కెచ్‌లో కొంత స్థలాన్ని కేటాయించారు. నాయకుల ఆదేశాలతో అధికారులు వాటిని కూడా రాసిచ్చారు. అధికారులకు రూ.లక్షలు ముట్టజెప్పడంతో రిజర్వ్ స్థలాలను కూడా రాసిచ్చారు. మొదట ఆ కాలనీలో గుడి, బడి, అంగన్‌వాడీ సెంటర్ కోసం 154, 155 ఇంటి పట్టాలను తీసేశారు. తర్వాత ఇతర గ్రామస్థులకు పట్టాలు ఇచ్చేశారు. ఈ లేఅవుట్‌లో కుణుతూరు గ్రామంతో పాటు ధర్మవరం పట్టణం, ఆ మండలంలోని ఇతర గ్రామాలు, రాప్తాడు, బత్తలపల్లి మండలాల వారికి కూడా పట్టాలు రాసిచ్చారు.

లోకాయుక్త విచారణ

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అనర్హులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారని ఆధారాలతో సహా ఆ గ్రామానికి చెందిన గొడ్డుమర్రి వెంకటేష్ కర్నూలులోని లోకాయుక్తను ఆశ్రయించారు. అప్పట్లో అధికారులకు నోటీసులు రావడంతో చేసేది లేక కొన్నింటిని తొలగిస్తున్నట్లు లోకాయుక్తకు స్థానిక అధికారులు వివరణ పంపించారు. లోకాయుక్తను కూడా తప్పుదోవ పట్టించే విధంగా అధికారులు ప్రయత్నించారు. వీటిపై ఇంకా విచారణ జరుగుతోంది. నిర్మాణాలను ఆపాలని లోకాయుక్త ద్వారా ఆదేశాలు వచ్చినా లెక్కచేయకుండా వైసీపీ నాయకులు ఇంటి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

అక్రమాలపై విచారణ చేస్తున్నాం

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో ఇచ్చిన పట్టాల అక్రమాలపై విచారణ చేస్తున్నాం. ఇంకా విచారణ కొనసాగుతోంది. త్వరలోనే లేఅవుట్‌లోని పట్టాలపై విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు అనర్హులపై తగు చర్యలు చేపడతాం.

- నటరాజ, తహసీల్దార్, ధర్మవరం





కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న ఆర్‌జే రత్నాకర్, కృత్రిమ కాళ్లతో నడుచుకుంటూ వెళ్తున్న దివ్యాంగుడు

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

పుట్టపర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో బుధవారం 113 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాల తయారీ కోసం గతంలో కొలతలు తీసుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించి.. కాళ్లు, చేతులు లేని వారికి అమర్చారు. రెండు కాళ్లు లేని ఓ వ్యక్తి కృత్రిమ కాళ్లతో వాకర్ సాయంతో నడుచుకుంటూ ఆనందంగా వెళ్లారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



జేసీ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందచేస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, ఆ పార్టీ నాయకులు

పుట్టపర్తి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విద్యార్థులకు వెంటనే చెల్లించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం, కదిరి, మడకశిర సమన్వయకర్తలు దీపిక, మక్బూల్ బాషా, ఈర లక్కప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పుట్టపర్తి గణేష్ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ జేసీ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, వసతి దీవెన, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం అమలు చేయాలని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అందిస్తామన్న ముఖ్యమంత్రి, యువతను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలుచేసేవరకు వైసీపీ పోరాటం చేస్తుందని అన్నారు.


వైసీపీది దొంగల ముఠా పోరు: టీడీపీ

హిందూపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువతపోరు కార్యక్రమం దొంగల ముఠా పోరు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సొమ్మును అధికారంలో ఉన్నప్పు జగన్ చెల్లించలేదని, ఇప్పుడు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువు, ఉద్యోగాలు వైఎస్సార్ భిక్ష అని ఆ పార్టీ నాయకులు వాగుతున్నారని, ప్రజలను భిక్షగాళ్లుగా పోల్చుతున్నారని మండిపడ్డారు. దిగిపోయేటప్పుడు కూడా జగన్ బటన్ నొక్కి డ్రామా ఆడారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో విద్యార్థుల తరఫున ఫీజులను నేరుగా కాలేజీల యాజమాన్యాలకు చెల్లించిందని గుర్తు చేశారు.

232 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు బుధవారం 232 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్ విద్యార్థులు 9,329 మందికి గాను 9,134 మంది పరీక్షలకు హాజరయ్యారు. 195 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 1,147 మందికి గాను 1,110 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు.

ఉష్ణోగ్రతలు



బుధవారం	
గరిష్ఠం	36.0
కనిష్ఠం	22.0



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 గురువారం సాయంత్రం	5.08 శుక్రవారం ఉదయం
కదిరి	6.30 గురువారం సాయంత్రం	5.11 శుక్రవారం ఉదయం
ధర్మవరం	6.33 గురువారం సాయంత్రం	5.07 శుక్రవారం ఉదయం
హిందూపురం	6.33 గురువారం సాయంత్రం	5.15 శుక్రవారం ఉదయం
పెనుకొండ	6.33 గురువారం సాయంత్రం	5.15 శుక్రవారం ఉదయం

ఇళ్లకు అదనపు నిధులు: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి అంత్యోదయ యోజన గృహాలకు అదనంగా నిధులు మంజూరు చేస్తున్నామని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం తెలిపారు. 2016-17 నుంచి 2023-24 వరకు జిల్లాలో 71,963 గృహాలు మంజూరయ్యాయని, ఇందులో 25,203 ఇళ్లు పూర్తి అయ్యాయని, మిగిలిన 40,024 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న గృహాలకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఇస్తోందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ అధికారులు తనిఖీ చేసి, లబ్ధిదారులను గుర్తిస్తారని తెలిపారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

సెల్‌లో చోరబాటు..!

రెచ్చిపోతున్న సైబర్ దొంగలు

- లింకులు పంపి సొమ్ము చోరీ
- లోన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట బురిడీ
- రెండేళ్లలో రూ.53 కోట్లు లూటీ

(వివరాలు 6వ పేజీలో..)

అభివృద్ధి బాట..

గుంతల రోడ్డుకు మోక్షం

కూటమి పాలనలో నూతనంగా నిర్మాణం.. ప్రజల హర్షం



గతంలో నడవడానికి వీలుకాని రహదారి..

నూతనంగా వేసిన గేమేనాయక్ తండా రోడ్డు



తనకల్లు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దలబండ తండా నుంచి ఎర్రగుట్టపల్లి వరకు రోడ్డులో ప్రయాణమంటే వాహనదారులు హడలిపోయేవారు. దారి పొడవునా పెద్ద పెద్ద గోతులు ఉండేవి. ఈ రోడ్డుపై వాహనాలు నడపాలంటే నరకప్రాయమే. ఏళ్లుగా రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత వైసీపీ పాలనలో సమస్య పరిష్కరించాలని ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణం చేపట్టారు. పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి అధికారంలోకి రావడంతో..

గద్దలబండ తండా నుంచి ఎర్రగుట్టపల్లి దారిలో వేపలపల్లి, గేమేనాయక్ తండా, పోమేనాయక్ తండా, బోడిచింతమాన్లు తండా, నరిసేనాయక్ తండా, కోళ్లఫాం, బుడ్డయ్యకోట, తులసేనాయక్ తండా, లక్ష్మీనాయక్‌తండా, నాయనిచెరువుపల్లి, జామ్లానాయక్ తండా, రతినేనాయక్ తండా, కమతంపల్లి, అద్దానంపల్లి, బాబేనాయక్ తండా, గుర్రంబైలు, ఎర్రబల్లి గ్రామాలు వస్తాయి. ఈ గ్రామాలను కలిపే రోడ్డు అధ్వానంగా ఉండేది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో తారురోడ్డు మొత్తం దెబ్బతిని, కంకర తేలి గుంతలమయమైంది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గతేడాది ఎన్నికల ప్రచారానికి వచ్చిన కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు సమస్యను తీసుకెళ్లారు. అధికారం చేపట్టిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడామని ఆయన హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నెలలు తిరక్కుండానే రోడ్డు నిర్మాణానికి చొరవ చూపారు. ఆయా గ్రామ పంచాయతీల నిధులు రూ.2.60 కోట్లతో పనులు చేపట్టారు. పూర్తి చేయించారు. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లపాటు ఇబ్బందులు పడ్డాం: సోమశేఖర్, వేపలపల్లి



మా గ్రామానికి రోడ్డు లేక ఏళ్లపాటు ఇబ్బందులు పడ్డాం. గుంతల రోడ్డుపై వాహనాలు నడపాలంటే నరక యాతన అనుభవించాం. తాజాగా రోడ్డు వేయడంతో ఆ కష్టాలన్నీ తీరిపోయాయి.

రోడ్డు వేయలేనేమో అనుకున్నా



సర్పంచ్‌గా గెలిచి, ఐదేళ్లు కావస్తోంది. ఏ కార్యక్రమానికి వెళ్లినా ప్రజలు అడిగే మొదటి సమస్య రోడ్డు. సమస్యను నా పదవీ కాలంలో తీరుస్తానో.. లేదో.. అనుకున్నా. కూటమి అధికారం చేపట్టిన వెంటనే రోడ్డుకు నిధులు మంజూరవడం, పనులు పూర్తి చేయడంతో ఆనందంగా ఉంది. -కాంతమ్మ, సర్పంచ్, గేమేనాయక్ తండా



సింహ వాహనంపై శ్రీవారు

తిరువీధుల్లో విహరిస్తూ.. భక్తులకు దర్శనం

కదిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బుధవారం సింహవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. యాగశాల నుంచి ఉదయం విచ్చేసిన శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని సింహ వాహనంపై అలంకరించి, ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తిరువీధుల్లో శ్రీవారు విహరించారు. వాహన సేవలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు, సింహవాహనంపై విహరిస్తున్న నారసింహుడు



నేడు హనుమంత వాహనంపై..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గురువారం హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సంధ్యా సమయంలో హనుమంతవాహనంపై కొలువుదీరి శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ఒక్కటి అయిన రాముడిని తన భుజస్కంధాలపై మోసిన హనుమంతుడు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా, నృసింహావతారంలో కోరిక నెరవేరుతుందని శ్రీరాముడు వరమిచ్చారని, అందుకే నారసింహుడికి హనుమంత వాహన సేవ నిర్వహిస్తారని వేద పండితులు తెలిపారు.


సెల్‌లో చోరబాటు..!

ఏమరుపాటుగా ఉంటే బురిడీ కొట్టిస్తారు. ఆశకు పోతే లూటీ చేసేస్తారు. పెట్టుబడులు, రుణాలు, కొరియర్.. ఇలా ఏవేవో చెప్పి లైన్‌లోకి వస్తారు. లింకు పంపి ఓపెన్ చేయమంటారు. ఓటీపీ చెప్పమంటారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, సీబీఐ.. ఇలా ఎవరెవరి పేరిటో లైన్‌లోకి వచ్చి బెదిరిస్తారు. బ్యాంకులో ఉన్న సొమ్మును దోచుకుంటున్నారు. నేరుగా వచ్చి సొమ్ము దోచుకునే సొమ్ముకంటే ఎక్కడో ఉంటూ.. మన సెల్‌ఫోన్‌లోకి చొరబడి దోచుకునే సొమ్ము చాలా ఎక్కువ అని పోలీసులు అంటున్నారు. వీరితో జాగ్రత్తగా ఉండాలని ఏకంగా 'కాలర్ టోన్' ద్వారా అవగాహన పెంచుతున్నారంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎవరికివారు జాగ్రత్తగా ఉండటం దీనికి ఉత్తమ పరిష్కారం. ఒక్కసారి సొమ్ము దొంగలచేతిలో పడితే.. తిరిగి రావడం చాలా కష్టం. ఏ కొద్దిమంది సొమ్మో రికవరీ అవుతోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం/నెట్‌వర్క్



● అనంతపురం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన రాగే ఎల్లప్ప బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది దసరా పండుగకు ఇక్కడకు వచ్చారు. అక్టోబరు 10న ఎస్‌బీఐ యోనో యాప్‌లో పాన్ కార్డు అప్‌డేట్ చేస్తుండగా... అప్‌డేట్ ఆధార్, ఆర్ పాన్ ఫర్ ఎస్‌బీఐ అనే పేరుతో ఏపీకే లింక్ వచ్చింది. అది క్లిక్ చేసిన వెంటనే రూ.49వేలు అతడి బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అయింది. కొంతసేపటికే మరోసారి రూ.50వేలు కట్ అయింది. దీంతో అప్రమత్తమైన ఎల్లప్ప కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశారు. వారు రెస్పాన్స్ ఇచ్చేలోపే మరోసారి రూ.49,999 కట్ అయింది. దీనిపై బాధితుడు.. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఎస్‌బీఐ అధికారులను కలిశారు. ఆధార్, పాన్, ఫిర్యాదు లేఖ తీసుకున్నారు. ఇంతవరకు రికవరీ లేదు.



ఎల్లప్ప ఖాతా నుంచి డబ్బు వెళ్లగానే ఎస్‌బీఐ నుంచి వచ్చిన మెసేజ్

● గార్లదిన్నె మండలానికి చెందిన రామాంజికి ఈ ఏడాది జనవరి 24వ తేదీన వాట్సాప్ వీడియోకాల్ వచ్చింది. ఒకరు హిందీ, మరొకరు తెలుగులో మాట్లాడారు. తాము సీబీఐ అధికారులమనీ, సైబర్ క్రైం ఇమ్మిగ్రేషన్ సంబంధించి ముంబై నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆధార్‌కార్డు దుర్వినియోగం చేశారనీ, కేసు నమోదైందనీ, ఇంట్లో ఉండి డోర్ వేసుకుని ఎవరితో మాట్లాడకుండా ఉండాలని చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని కోరారు. ఫోన్‌పేలో డబ్బు ఎంత ఉందో స్క్రీన్‌షాట్ పెట్టమన్నారు. అది పెట్టగానే.. అకౌంట్ ట్రాన్సాక్షన్స్ చూస్తామని చెప్పి రూ.49,999 పంపమన్నారు. రామాంజికి అనుమానం వచ్చినా.. భయంతో వారికి ఫోన్‌పే చేశాడు. ఇంకో అకౌంట్ ఉంటే ఆ వివరాలు పంపాలన్నారు. మరో అకౌంట్‌లో రూ.1.50లక్ష ఉండటంతో బ్యాంకు వారితో మాట్లాడతానని చెప్పి ఫోన్ కట్ చేశాడు.



గార్లదిన్నె మండలానికి చెందిన వ్యక్తికి వీడియో కాల్ చేసింది ఈ వాట్సాప్ గ్రూప్ నుంచే



రెచ్చిపోతున్న సైబర్ దొంగలు

- లింకులు పంపి.. సొమ్ము చోరీ
- లోన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట బురిడీ
- రెండేళ్లలో రూ.53 కోట్లు లూటీ
- అప్రమత్తత.. అవగాహనే శరణ్యం

● అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డులో మేకల షేక్ హుస్సేన్, షేక్ రిజ్వానా దంపతులు నివాసముంటున్నారు. షేక్ హుస్సేన్ దక్షిణాఫ్రికాలో మైనింగ్ కంపెనీలో పనిచేస్తుంటారు. ఇక్కడకు వచ్చినపుడు సెప్టెంబరు 12న ఫేస్‌బుక్‌లో షేర్ మార్కెట్‌లో జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ పేరుతో ఉన్న ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే వాట్సాప్‌లో ఐశ్వర్యశాస్త్రి పేరుతో ఒకామె చాట్ చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే లాభాలొస్తాయని చెప్పింది. ఈక్రమంలో షేక్ హుస్సేన్ తొలుత రూ.2లక్షలు, రూ.3లక్షలు.. ఇలా పెట్టుబడి పెడుతూ వచ్చారు. తిరిగి అక్కడకు వెళ్లాక తన భార్యతో బ్యాంకులో డబ్బు వేయించారు. అదే క్రమంలో రూ.15లక్షలు, రూ.20లక్షలు సైతం వేశారు. చివరకు ఇల్లు విక్రయించి డబ్బు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. అలా గతేడాది డిసెంబరు 4న ఒకేసారి రూ.40లక్షలు అతడి భార్య.. భర్త చెప్పిన అకౌంట్‌కు నగదు పంపారు. సంబంధిత బ్యాంకు మేనేజర్ 'ఎందుకు అంత అమౌంట్ పంపుతున్నారు.. రెండు రోజులు ఆలోచించండి..' అన్నారట. అయినా.. వారు వినలేదు. అలా మొత్తం రూ..1.33 కోట్లు పంపాక మోసపోయామని తెలిసింది. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సైబర్ పోలీసులకు తెలియజేశారు.

● రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ గతనెల మొదటివారంలో పుట్టినిల్లయిన చెన్నేకొత్తపల్లి మండలం ఓబుళంపల్లికి వెళ్లింది. ఈనెల 2వ తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆరోగ్యశ్రీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'మీ నాన్నకు ఆరోగ్య శ్రీ కింద రెండేళ్ల క్రితం శస్త్రచికిత్స చేశారనీ, దానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40వేలు పెండింగ్‌లో ఉందనీ, ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేస్తా'నని నమ్మబలికాడు. అందుకు సెల్‌ఫోన్‌కు లింక్ పంపుతాననీ, దానిని ఓపెన్ చేసి క్లిక్ చేయాలని చెప్పాడు. అది నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేసింది. కొంతసేపటికే రూ.47,287 ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. విషయం ఆ మహిళ.. సంబంధిత గుర్తుతెలియని వ్యక్తికి చెప్పగా... మరోసారి లింకు పంపిస్తాననీ, పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం జమ అవుతుందని చెప్పాడు. అలా మరో లింక్‌ను క్లిక్ చేయగానే.. క్షణాల్లో రూ.40వేలు ఖాతా నుంచి వెళ్లినట్లు మెసేజ్ వచ్చింది. అదే విషయంలో ఆమె నిలదీయగా.. మరోసారి ట్రై చేయమన్నాడు. ఈసారి క్లిక్ చేయగానే... అమె అకౌంట్ నుంచి రూ.17500 డబ్బు మాయమైంది. దీంతో మోసపోయానని గ్రహించి టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి, విషయం తెలియజేసింది. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



● నెలరోజుల క్రితం అనంతపురంలోని రామచంద్రనగర్‌లో ఓ జనరల్ స్టోర్ నిర్వాహకుడు... ఫోన్ పేలో సమస్య రావడంతో గూగుల్‌లో ఫోన్‌పే కస్టమర్ కేర్ నంబర్ సెర్చ్ చేశాడు. కొన్ని నంబర్లు కనిపించాయి. అందులో మొదటి నంబర్‌కు కాల్ చేసి, సమస్య చెప్పాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. 'నీ ఫోన్ పేకు రూపాయి పంపుతాన'ని చెప్పాడు. జనరల్ స్టోర్ నిర్వాహకుడిని రూపాయి పంపమని కోరాడు. ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని చెప్పి.. ఓటీపీ వస్తుందనీ, అది చెప్పమన్నాడు. షాపు నిర్వాహకుడు ఓటీపీ పంపిన సెకన్లలో అతడి బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.8వేలు కట్ అయింది.

తిరిగొచ్చేది చాలా తక్కువ...

అనంతపురం నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ గతేడాది ఏప్రిల్‌లో తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.10లక్షలు మాయమయ్యాయని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన సైబర్ క్రైమ్ విభాగాధికారులు అ డబ్బు వెళ్లిన విధానం విస్తుగొలిపింది. మధ్యలో ఎలాంటి సంబంధంలేని వ్యక్తి అకౌంట్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఆ డబ్బు లాక్కున్నారు. ఆ మహిళ అకౌంట్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్‌కు వెళ్లింది. ఆ అకౌంట్ నుంచి సైబర్ నేరస్తులు మరో అకౌంట్‌కు బదిలీ చేసుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు ఆ డబ్బు తిరిగి ఆ మహిళ అకౌంట్‌కు వచ్చేలా చేశారు. ఇలాంటి కేసులు చాలా తక్కువనీ, ముందుగానే వివరాలన్నీ తెలియజేసి, వారికి డబ్బు పంపుతున్నట్లు సమాచారం చేరవేస్తే ఆ డబ్బు తీసుకురావడం చాలా కష్టమంటున్నారు సైబర్ విభాగ అధికారులు.

రూ.కోటి వెళ్తే... రూ.22లక్షలే వచ్చాయి..

ఏడాదిన్నర క్రితం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమాని అకౌంట్ నుంచి రూ.కోటి మాయమైంది. మరుసటి రోజు బ్యాంకు అధికారులు విషయం తెలియజేశారు. కేవలం ఆరు ట్రాన్సాక్షన్లతోనే రెండురోజుల వ్యవధిలో రూ.కోటి మాయమైంది. సైబర్ నేరగాళ్లు అలా దోచేసిన ఘటనపై బాధితుడు.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందులో హర్యానా, ఢిల్లీ వాసుల ప్రమేయం ఉందని తెలిసి పోలీసులు పలుసార్లు తిరిగి రూ.22లక్షలు మాత్రమే పట్టుకురాగలిగారు. బ్యాంకు బాధితుడికి బాధ్యతగా ఆ డబ్బు అందజేయాల్సి ఉంటుంది. అది వేరే సంగతి.

రోజూ 10 ఫిర్యాదులు

జిల్లావ్యాప్తంగా ఫ్రాడ్‌కాల్స్‌పై రోజూ 8 నుంచి 10 ఫిర్యాదులు వస్తుంటాయని సైబర్ విభాగ అధికారులు చెబుతున్నారు. ముందుగానే బ్యాంక్ అకౌంట్ వివరాలన్నీ తెలియజేసి, డబ్బు పంపితే వెనక్కు తీసుకురావడం కష్టమేనంటున్నారు సైబర్ పోలీసులు. ఉన్నపలంగా అకౌంట్ నుంచి మాయమైతే అది కూడా కొన్ని గంటల్లోపే ఫిర్యాదు చేస్తే కొంతవరకు హోల్డ్ చేసే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ ఇంటి వద్ద ఉంటున్నాడు. జనవరిలో సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి, 'నీపై 18 కేసులు నమోదయ్యాయనీ, నీ పేరుతో అక్రమ రవాణాలు సాగుతున్నాయనీ, రూ.4.50 లక్షలు పంపితే అకౌంట్ ఫ్రీజ్ కాకుండా ఆపుతామ'ని బెదిరించారు. దీంతో భయపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొత్తం డబ్బు యాప్‌లో పంపాడు.


● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యక్తికి కారు లాటరీ తగిలిందని వాట్సాప్‌లో ఫొటోలు పంపారు. జీఎస్టీ, రిజిస్ట్రేషన్ తదితరాలకు అమౌంట్ పంపాలని నమ్మబలికారు. రూ.6లక్షలు సైబర్ నేరగాళ్లు జమ చేయించుకున్నారు. తరువాత మోసపోయానని తెలుసుకున్న బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యాపారికి తన ఖాతాలోకి 5వేల రూపాయలు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. మెసేజ్ ఓపెన్ చేసి చూసేసరికి రూ.32వేలు ఖాతా నుంచి మాయమైంది. దీనిపై బాధితుడు.. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి తెలిపాడు.

● గుంతకల్లులో పలువురు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి డబ్బు పోగొట్టుకున్నారు. డిసెంబరులో 12, ఈ ఏడాది జనవరిలో 17 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. పట్టణానికి చెందిన జీ రామాంజనేయులు అనే రైల్వే ఉద్యోగి ఖాతా నుంచి నెల కిందట రూ.95,000 తస్కరించారు. జీతం పడిన వెంటనే రూ.50 వేలు, రెండో దఫాగా రూ.45 వేలు డబ్బు డ్రా అయిపోయాయి. బ్యాంకుకు వెళ్లి అడిగితే ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన వివరాలేవీ లభ్యం కావడంలేదని బ్యాంకు అధికారులు చేతులెత్తేశారని బాధితుడు వాపోయాడు. సంపత్ కుమార్ అనే వ్యక్తికి డ్రోన్ కెమెరా పంపుతున్నామంటూ రూ.17 వేలు కాజేశారు. వరదరాజులు అనే మాజీ కౌన్సిలర్ ఖాతా నుంచి రూ.20 వేలు తస్కరించారు. మూడు నెలల కిందట వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన శివారెడ్డి వాట్సాప్‌కు ఓ పోస్టు రాగా, దాన్ని చూడటానికి టచ్‌చేశారు. వెంటనే అతడి ఫోన్‌లోకి ఓ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యి అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 9,975 చొప్పున రెండుసార్లు డబ్బు డ్రాచేసేశారు. వీటన్నిటిపైనా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఒక్క కేసూ పరిష్కారం కాలేదు.



ఎక్కువగా ఇలా చేస్తారు...!



సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, నార్కోటిక్, ఐటీ, ఆర్‌బీఐ, కస్టమ్స్, పోలీసు అధికారులం అంటూ ఫోన్ కాల్ చేస్తుంటారు. 'మీ పేరుపై కొరియర్ వచ్చిందని, అందులో డ్రగ్స్ వెపన్స్, అక్రమ వస్తువులు ఉన్నాయ'ని బెదిరిస్తారు. 'మీ బ్యాంకు అకౌంట్, ఆధార్, పాన్, మొబైల్ నంబర్ల ద్వారా మనీ ల్యాండరింగ్ జరిగిందనీ, మీపై కేసులున్నాయని వీడియో కాల్ ద్వారా విచారణ' అంటూ డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు లోనుచేస్తారు. ఈ కేసులో బెయిల్ కావాలన్నా కేసు నుంచి తప్పించాలన్నా డబ్బు పంపాలని బెదిరిస్తుంటారు. ఇలా డబ్బు దోచుకోవటాన్ని డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ అంటారు.

ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్

సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపి లోన్ పొందడానికి ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని ఎర వేసి, చిన్న మొత్తంలో లోన్ ఇచ్చి, రోజులు గడవకముందే ఫోన్ చేసి వడ్డీతో సహా డబ్బు కట్టమనీ, లేదంటే ఫొటోలను మార్ఫింగ్ చేసి, కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపుతామని బలవంతంగా డబ్బు తీసుకుంటారు. దన్ని ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్ అంటారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్..

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేసి తమ సంస్థ ద్వారా స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్/ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే తక్కువ సమయంలో అధిక లాభాలు పొందవచ్చని నకిలీ యాప్స్/వెబ్‌సైట్లలో లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ డబ్బు దోచేస్తున్నారు.

ఏపీకే ఫైల్ ఫ్రాడ్

సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన లింక్స్/ఏపీకే ఫైల్స్ పంపి వాటిని క్లిక్ చేస్తే మొబైల్‌లో హానికరమైన ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అయి, వాట్సాప్‌ను హ్యాక్ చేసి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం అపహరిస్తారు. తద్వారా డబ్బును దోచేస్తారు. స్నేహితులు, కుటుంబసభ్యులకు ఈ హానికరమైన ఏపీకే ఫైల్స్‌ను పంపి, వారి మొబైల్ ఫోన్స్ హ్యాక్ చేస్తారు. ఇంకా టెలిగ్రామ్‌లలో ఇన్వెస్ట్ చేయాలని చెబుతూ... రూ.వెయ్యికి రూ.1500 అదనంగా వేస్తారు. రూ.2వేలకు రూ.3000 రూ.5వేలకు రూ.8వేలు పంపుతారు. రూ.7వేలు వేయగానే డబ్బు రాదు. డబ్బు రావాలంటే అదనంగా పంపాలని మోసం చేస్తాడు. ఆ మొత్తం పంపితే అంతే సంగతి.



● చైనీస్ మూలాలేనా..?

సైబర్ మోసాల వెనుక చైనీస్ మూలాలున్నట్లు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మోసాల ద్వారా వెళ్లే డబ్బు టాప్‌లో నడిపిస్తున్న ఒకే ఒక్కడికి ఎక్కువ శాతం వెళ్తుంటుంది. ఈ సైబర్ క్రైమ్‌లో పాలుపంచుకున్న వారికి పర్సెంటేజీల తరహాలో వెళ్తుంటుంది. ఆ కీలక వ్యక్తి ఎవరనేది ఎవరికీ తెలియదు. ఈ వ్యవహారమంతా అంతర్జాతీయ స్థాయిలో సాగుతోందనేది ఒక అంచనా. చాలాసార్లు ఈ డబ్బు దేశాన్ని సైతం దాటిపోయి ఉంటుందని సైబర్ వర్గాలు చెబుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆ డబ్బు తిరిగి ఖాతాల్లో జమ అవడం చాలా చాలా కష్టమట. ఫేక్ ఫైల్స్ ఉన్న లింకులను ఓపెన్ చేయకపోవడం, ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు, ఆధార్, పాన్, ఓటీపీలను అడిగితే చెప్పకపోవడమే సేఫ్. నష్టపోయి, పోలీసులను ఆశ్రయించడం ద్వారా పెద్దగా ఉపయోగమేమీ ఉండకపోవచ్చు. జాగ్రత్తే శ్రీరామ రక్ష.


● రెండేళ్లలో రూ.53కోట్ల దోపిడీ..

జిల్లాలో దోపిడీ దొంగల కంటే సైబర్ నేరస్తులు ఎత్తుకెళ్లేదే ఎక్కువగా ఉంది. జిల్లా పరిధిలో ఏటా జరిగే చోరీల్లో రూ.6కోట్ల వరకు దోచుకెళ్తుంటారనేది పోలీసు వర్గాల అంచనా. గత రెండేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.53కోట్లు కాజేశారట. 2023, 24 సంవత్సరాల్లో జిల్లావ్యాప్తంగా ఇంత మొత్తం కాజేసి ఉంటారని సైబర్ లెక్కలు చెబుతున్నాయి.

● రైతులనూ వదలక..

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రైతన్నలు కూడా చిక్కుతున్నారు. బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు రైతులు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బు దోచేశారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు చిత్రశేఖర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వచ్చింది. కెనరా బ్యాంకు నుంచి మొదటిసారి రూ.99వేలు కట్ అయింది. రెండోసారి మళ్లీ ఓటీపీ వచ్చిం ది. మళ్లీ రూ.49,999 కట్ అయింది. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఫోన్‌పే లింకు ద్వారా కట్ అయిందని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశాననీ, ఇంకా డబ్బు రాలేద ని బాధితుడు వాపో యాడు. బొమ్మన హాళ్ మండలం దర్గాహొన్నూరు చెందిన నుంకేష్ మొబైల్‌కు జనవరిలో ఓటీపీ వచ్చింది. రూ.5 వేలు చొప్పున రెండుసార్లు కట్ అయింది. దీంతో జాగ్రత్తపడి రూ.50వేలు స్నేహి తుడికి ఫోన్ పే చేసి, కాపాడుకోగలిగాడు.





రైతులు నుంకేష్, చిత్ర శేఖర్,



15నుంచి డ్వామాలో బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు అర్హులు. ఐదేళ్ల ఒకేచోట పనిచేస్తున్న వారు కచ్చితంగా క్లస్టర్ మారాల్సి ఉంటుంది. డ్వామాలో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు బదిలీలు చేపట్టనున్నారు. ఈనెల 15న ప్రక్రియ ప్రారంభించి, ఈనెల 20వతేదీలోపు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీలోపు ఉద్యోగులు బదిలీ అయిన స్థానంలో చేరాల్సి ఉంటుంది. ఈనెల 24వ తేదీలోపు ఉద్యోగుల బదిలీ వివరాలను సీఆర్‌డీ కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభించి, పారదర్శకంగా పూర్తి చేస్తామని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు.

40 మంది ఇంజనీర్లకు విముక్తి

కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసినందుకు కక్షగట్టి గత వైసీపీ ప్రభుత్వం చేసిన విజిలెన్స్ విచారణలు, వేధింపులు, క్రమశిక్షణ చర్యల నుంచి ఉమ్మడి జిల్లాలో సుమారు 40 మంది జలవనరుల శాఖ ఇంజనీర్లకు విముక్తి లభించింది. జలవనరుల శాఖ ఇంజనీర్లపై కక్ష సాధింపులు, క్రమశిక్షణా చర్యలు, విజిలెన్స్ విచారణలు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. అప్పట్లో మైనర్ ఇరిగేషన్, హెచ్చెల్సీలో పనిచేసిన ఇంజనీర్లు కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో మైనర్ ఇరిగేషన్ ఈఈగా పనిచేసిన ప్రస్తుత హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన బాధిత ఇంజనీర్లకు ప్రభుత్వ నిర్ణయం ఊరట కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, డిప్లొమా, మెకట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ సిస్టం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసువారు అర్హులన్నారు. ఏదేని రంగంలో మూడేళ్ల అనుభవం కలిగిన వారికి ఇంగ్లిష్ ప్రొఫిషియెన్సీ, టెక్నికల్ స్కిల్ అసెస్మెంట్ టెస్టులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగలవారికి 4 నెలలపాటు విజయవాడ, విశాఖపట్నంలో జర్మన్ భాషపై శిక్షణ ఇస్తామన్నారు. ఏ2 పరీక్ష ఉత్తీర్ణత అనంతరం జర్మనీలో ఉపాధి కల్పిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వీసా, విమాన ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ లోగానీ, 9988853335, 8712655686 నంబర్లలోగానీ సంప్రదించాలన్నారు.

అంజినయ్య సేవలు మరువలేనివి



అంజినయ్యకు నివాళులర్పిస్తున్న ఇండేన్ గ్యాస్ కార్యాలయ సిబ్బంది

ఉరవకొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసంస్థల ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అంజినయ్య ఆ సంస్థల ద్వారా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని ఇండేన్ గ్యాస్ కార్యాలయ సమీపంలో బుధవారం అంజినయ్య వైకుంఠ సమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాల్గొని ఆయన చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారా విశ్వనాథ్, సత్యసాయి ఇండియన్ గ్యాస్ కార్యాలయ మేనేజరు నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

08554-228234కు ఫోన్ చేయండి: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గర్భస్థపిండ లింగనిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని, ఎక్కడైనా, ఎవరైనా ఆ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదుల సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే 08554-228234 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. స్కానింగ్ సెంటర్లు, పరీక్షలు చేసిన డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎంహెచ్ఓ తెలిపారు.

సీఆర్సీలకు రూ.1.35 కోట్లు..

అనంతపురం విద్య, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు చేసిన క్లస్టర్ రిసోర్స్ సెంటర్ల(సీఆర్‌సీ)కు భారీగా గ్రాంటు విడుదల చేసినట్టు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 135 సీఆర్సీలకు మీటింగ్ టీఏ, మెయింటెనెన్స్, కంటింజెన్సీ, టీఎల్ఎం గ్రాంటు కింద ఒక్కో సెంటర్‌కు రూ. లక్ష చొప్పున విడుదల చేశామన్నారు. సీఆర్సీల ప్రధానోపాధ్యాయులకు రూ.1.35 కోట్లు నాలుగు పద్దుల కింద విడుదల చేశామన్నారు. మండల విద్యాశాఖాధికారుల ఆమోదంతో నిబంధనలకు మేరకు ఖర్చు చేసి టీసీఎస్ రూపొందించిన యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

జూనియర్ కళాశాలలకు...

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంటు విడుదల చేసినట్లు ఏపీసీ తెలిపారు. జిల్లాలో 26 కళాశాలకు మొత్తం రూ. 16 లక్షలు విడుదల చేశామన్నారు. ఎంఈఓల ఆమోదంతో నిబంధనలకు మేరకు ఖర్చు చేసి టీసీఎస్ రూపొందించిన యాప్‌లో, ప్రబంధ్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలను ఆదేశించారు.

డుమ్మాలకు చెక్..!

సచివాలయ సిబ్బందికి ముఖహాజరు తప్పనిసరి

గైర్హాజరుపై డీడీఓలకు షోకాజ్‌లు

వివరణ ఇవ్వడానికి డీపీఓ కార్యాలయానికి క్యూ..

అనంతపురం న్యూటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పనుల కోసం ప్రజలు.. సచివాలయాలకు వెళితే సిబ్బంది ఉండరన్న విమర్శ ముందునుంచీ ఉంది. దీంతో ప్రజలు పదేపదే సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికి చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. పాలన మెరుగు పరిచేందుకు అడుగులు వేస్తోంది. ఆ దిశగా ముఖహాజరు తప్పనిసరి చేసింది. దీనిని సిబ్బంది సీరియస్‌గా తీసుకోకుండా ఇబ్బందులు కొని తెచ్చుకున్నారు. సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై సంబంధిత డీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. నోటీసులు అందుకున్న డీడీఓలు వివరణ ఇచ్చుకునేందుకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయానికి క్యూ కట్టారు. వారు ఇచ్చే వివరణ నిబంధనలకు అనుగుణంగా లేకుంటే చర్యలు తప్పవని డీపీఓ నాగరాజనాయుడు స్పష్టం చేస్తున్నారు.



డీపీఓ కార్యాలయం

లైట్ తీసుకుని..

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా కార్యాలయానికి వచ్చివెళ్తామంటే కుదరదు. సమయపాలన పాటించాల్సిందే. ఉదయం, సాయంత్రం రెండుపూటలా ఫేస్ యాప్‌లో ముఖ హాజరు తప్పనిసరిగా వేయాల్సిందే. గత ప్రభుత్వ హయాంలో ముఖ హాజరు ఉన్నప్పటికీ నిర్వహణలో విఫలమవడంతో సిబ్బంది సచివాలయాలకు ఇష్టారాజ్యంగా వచ్చిపోయేవారన్న విమర్శలున్నాయి. దీంతో పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు కనీస సమాచారం ఇచ్చేవారు ఉండేవారు కాదు. ప్రతి సచివాలయంలో పలు విభాగాలకు సంబంధించి 10 మంది వరకు సిబ్బంది ఉన్నారు. అయినా.. సాకులు చెబుతూ.. కార్యాలయాలకు డుమ్మాకొట్టే సిబ్బందే ఎక్కువన్న విమర్శలున్నాయి. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతేడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచే ముఖహాజరు రెండు పూటలా తప్పనిసరి చేసింది. అయినా.. సిబ్బందిలో మార్పు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తుంటాయనీ, అవి మామూలేనన్నట్లు డుమ్మారాయుళ్లు లైట్ తీసుకున్నారు. కొంతమంది విధులకు హాజరైనా క్షేత్రస్థాయికి వెళ్లినపుడు యాప్‌లో ఉన్న ఆప్షన్స్ వినియోగించడంలో అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో సమయానికి అనుగుణంగా సంబంధిత సచివాలయం వద్దకు వెళ్లి హాజరు వేసుకుంటే సరిపోతుంది. పింఛన్ పంపిణీ, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగంగా క్షేత్రస్థాయికి వెళ్లినపుడు రెగ్యులర్‌గా వినియోగించే ఆప్షన్ కాకుండా మరొక దాని ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై అవగాహనలేని సిబ్బంది హాజరు వేయలేకపోయారు. అయినా క్షేత్రస్థాయిలో పని చేస్తున్నామనీ, హాజరుతో ఏం పని అన్నట్లుగా వ్యవహరించారు. వారి నిర్లక్ష్యం ఫలితంగా షోకాజ్ నోటీసులు తీసుకుని, వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకున్నారు.

గతనెల 28న జారీ చేసిన నోటీసు ప్రకారం ముఖహాజరు వివరాలివీ..

మండలం	సచివాలయం	కార్యదర్శుల సంఖ్య	హాజరు సంఖ్య	గైర్హాజరు శాతం
కణేకల్లు	తుంబిగనూరు	3	1	66.6
అనంతపురం	కందుకూరు-1	8	3	62.5
అనంతపురం	రాజీవ్ కాలనీ-2	7	3	57.14
బెలుగుప్ప	హనిమిరెడ్డిపల్లి	10	4	60
బీకేఎస్	చెన్నంపల్లి-1	8	4	50
గుమ్మఘట్ట	తాళ్లకేర-1	6	3	50
బ్రహ్మసముద్రం	పాలవెంకటాపురం	7	4	42.86
కంబదూరు	కర్తనపల్లి	7	4	42.86
కుందుర్పి	బెస్తరపల్లి	10	7	30

విధులపై నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలున్నాయి. వీటిలో గ్రేడ్-1కు సంబంధించిన కార్యదర్శులు 49 మంది, 18 మంది గ్రేడ్-2, 115 మంది గ్రేడ్-3, 441 మంది గ్రేడ్-4 ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ అమలులో భాగంగా చేపట్టిన నియామకాల్లో 567 మంది గ్రేడ్-5, 896 మంది గ్రేడ్-6 కింద ఉన్నారు. గ్రేడ్-6 మినహా ఐదు గ్రేడ్లకు సంబంధించిన వారికే చాలా వరకు డీడీఓ అధికారాలున్నాయి. వీరి ఆధీనంలోనే మిగిలిన విభాగాలకు చెందినవారు పని చేయాల్సి ఉంటుంది. ప్రతి సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించిన వారు దాదాపు 10 మంది దాకా ఉండటంతో వారందరి హాజరు బాధ్యత డీడీఓపైనే ఉంటుంది. ఈనెల 1వ తేదీ మాత్రమే ఏకంగా 126 మంది డీడీఓలకు సంబంధిత సిబ్బంది హాజరు నమోదు చేయలేదనీ, క్రమం తప్పకుండా వేసేలా చూడాలనీ, గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని డీపీఓ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఖంగుతిన్న డీడీఓలు... డీపీఓ కార్యాలయానికి వివరణ ఇవ్వడానికి క్యూ కడుతున్నారు. డీడీఓ అధికారాలు ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో మాతృశాఖ అధికారులు ఆ శాఖకు సంబంధించిన పని చెప్పారన్న సాకులతో సచివాలయాలకు డుమ్మా కొట్టేవారు. సంబంధిత అధికారుల వ్యక్తిగత పనులు చేసేవారన్న విమర్శలున్నాయి. ముఖ హాజరు తప్పనిసరి చేయడంతో వ్యక్తిగత పనులకు వెళ్లేవారికి ఇబ్బందిగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో సచివాలయాలకు వచ్చే ప్రజలకు తగిన న్యాయం చేకూరే అవకాశం ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ధ్రువీకరణ పత్రం కోసం సచివాలయానికి వెళ్తే సంబంధిత సిబ్బంది ఉండరు. దీంతో పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ప్రభుత్వ నిర్ణయంతో ముఖహాజరు కోసమైనా సచివాలయానికి వెళ్లాల్సిందే. ఆ సమయంలో ప్రజలు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అవకాశం ఉంటుంది.

హాజరు లేదంటే చర్యలు తప్పవ్..

ముఖ హాజరుపై డీడీఓలకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. అయినా కొన్ని ప్రాంతాల్లో మార్పు రాలేదు. ప్రభుత్వం దీనిని సీరియస్‌గా పరిగణిస్తోంది. దీంతో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేశాం. సరైన వివరణ ఇవ్వకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు.

-నాగరాజనాయుడు, డీపీఓ

మామిడికి రక్షణ కవచం

50 శాతం సబ్సిడీ వర్తింపు: కలెక్టర్

అనంతపురం అర్బన్/నంబులపూలకుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మామిడి రక్షణ కవచం ద్వారా అనేక లాభాలున్నాయని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మతో కలిసి అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా రైతులకు హెక్టారుకు 10వేల కవర్లు సబ్సిడీతో అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2 కాగా 50 శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. రైతులు స్వయంగా రక్షణ కవర్లను కొనుగోలు చేసి వినియోగించుకున్నా వారి ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము జమ చేస్తామని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రక్షణ కవర్లను కొనుగోలు చేస్తే సంఘాల ఖాతాకు సబ్సిడీ డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కవర్ వాడటం ద్వారా ఊజి ఈగ, మచ్చలు, తేనె మంచు పురుగు, తామర పురుగు తదితర తెగుళ్లను నివారించవచ్చని, నాణ్యమైన పండ్ల దిగుబడి సాధ్య మౌతుందని తెలిపారు. క్రిమి కీటకాలు, అధిక సూర్యరశ్మి నుంచి పండ్లకు రక్షణ కల్పించవచ్చునన్నారు. ఫ్రూట్ కవర్‌ను వినియోగిస్తే పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదని అన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మామిడి తోటలు ప్రస్తుతం పిందె దశలో ఉన్నందున యాజమాన్య పద్ధతులు పాటించాలని కదిరి ఉద్యానవనశాఖాధికారి ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రస్తుతం నల్లతామర, రసం పీల్చే పురుగులు ఆశిస్తాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నీటి తడులు అధికంగా ఇవ్వాలని సూచించారు. నత్రజని, భాస్వరం, పోటాషియం ఎరువులను తగు మోతాదులో చెట్లకు అందించాలని అన్నారు. నల్లతామర, రసం పీల్చే పురుగుల వలన మామిడి పిందెలు రాలుతాయని తెలిపారు. దీని నివారణకు ఎకరాకు 40నుంచి 50 నీలి, లేదా తెలుపు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేపనూనె 2, 3 మి.మీ. ఒక లీటర్ నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. లేదా.. బవేరియా, బాసియాన 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. నల్లతామర అదుపులోకి రాకపోతే 2 మి.లీ. పిప్రోనిల్, లేక 0.3. మి.లీ. ఇమిడాక్లోఫిడ్, లేక 0.3గ్రాముల తయామిథాక్స్ లీటర్ నీటిలో కలిపి రెండు లేదా మూడుమార్లు పిచికారీ చేయాలని సూచించారు.

జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించండి

రాజధానిలో ఎమ్మెల్యేలకూ స్థలాలివ్వండి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ



రాయదుర్గం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులకు ఇంటి పట్టాలతో పాటు ఇళ్ల నిర్మించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో రాజధాని అమరావతి నగరం రాష్ట్రానికి పెద్ద ఆస్తి కాబోతోందని పేర్కొన్నారు. ఈ నగరం అన్ని ప్రాంతాల వారిది అనే భావనను మరింత బలపరిచేలా జర్నలిస్టులతో పాటు ఎమ్మెల్యేలకు నివాస స్థలాలు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా అప్పట్లో ఎమ్మెల్యేలకు నివాసస్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో సమావేశమై చర్చించామని పేర్కొన్నారు. అప్పట్లో కార్యరూపం దాల్చలేదని, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలు జగన్ బుట్టదాఖలు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయని అన్నారు. రాష్ట్రానికి ప్రధాన ఆకర్షణగా, ఆదాయవనరుగా మారబోతున్న అమరావతిలో జర్నలిస్టులతో పాటు ఎమ్మెల్యేలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

పదెకరాల వరకు రాయితీ వర్తింపజేయాలి

అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా రైతాంగానికి 10 ఎకరాల వరకు 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను వర్తింపచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014 నుంచి 2019 వరకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్న రైతాంగానికి 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను అందచేయాలని ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రైతాంగం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. ఉమ్మడి అనంత జిల్లాలను హార్టికల్చర్‌హబ్‌గా మార్చాలన్న ఉద్దేశంతో సాగుతున్నారని, ఆ దిశగా రైతాంగానికి 90శాతం సబ్సిడీతో, ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో ఉద్యానవన పరికరాలను అందించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాయలసీమ, ఉమ్మడి జిల్లా రైతాంగ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్‌హబ్‌గా మార్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు.

రైతు గోడు పట్టదా..?

సీడ్స్ షాపు ఎదుటే ఆత్మహత్యాయత్నం

నాసిరకం కళింగర విత్తనాలతో నిండా మునిగానని ఆవేదన



ఆరాతీస్తున్న ఏఓ శశికళ

అనంతపురం క్రైం, మార్చి12(ఆంధ్రజ్యోతి): నాసిరకం కళింగర విత్తనాలతో ఓ రైతు నిండా మునిగాడు. ఆరుగాలం శ్రమ, రూ.20 లక్షలు పెట్టుబడి కోల్పోయాడు. సర్వం నష్టపోయి రోడ్డున పడ్డాడు. తనకు వాటిల్లిన మోసంపై విత్తనాలు అమ్మిన షాపు నిర్వాహకులను నిలదీశాడు. వారు పట్టించుకోలేదు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేసినా.. నిష్ప్రయోజనం. ఆఖరుకు పంచాయితీ చేసి.. రూ.2 లక్షలు చెల్లిస్తామన్న షాపు యాజమాన్యం.. తరువాత చేతులెత్తేసింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు.. విత్తనాల షాపు ఎదుటే పురుగుల మందు తాగాడు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన మురళి తనకున్న 4.5 ఎకరాల పొలంలో కళింగర పంట సాగు చేయాలనుకున్నాడు. అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న శ్రావణి సీడ్స్ ఎంటర్ ప్రైజెస్‌లో గతేడాది నవంబరు 27న కిలో రూ.50వేల చొప్పున కిలోన్నర విత్తనాలు కొనుగోలు చేశాడు. వాటిని పొలంలో వేశాడు. కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. కళింగర కాయలు ఏర్పడ్డాయి. పంట కోసి విక్రయించుకుందామనుకునానడు. కళింగర కాయలు మాగలేదు. లోపల ఎరుపు రంగు ఏర్పడలేదు. 70 రోజులకు పూర్తి కావాల్సిన పంట.. 110 రోజులైనా కాయ తెల్లగానే ఉంది. దీంతో రైతు ఆందోళన చెందాడు. విత్తనాలు కొన్న దుకాణం వద్ద కెళ్లి పరిస్థితి వివరించాడు. వారు పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది. బత్తలపల్లి, అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. ఎవరూ పట్టించుకోలేదు. రూ.2లక్షల వరకు ఇస్తామని చెప్పిన శ్రావణి సీడ్స్ యాజమాన్యం.. తరువాత చేతులెత్తేసినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన రైతు మురళి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో షాపు ఎదుటే పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతును అనంతపురం ఏఓ శశికళ పరామర్శించారు. ఆత్మహత్యకు కారణాలపై ఆరాతీశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

పట్టించుకోకనే..

ఎవరూ న్యాయం చేయకపోవడంతోనే రైతు మురళి పురుగుల మందు తాగాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు మీడియాతో మాట్లాడారు. పంటకు రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. కాయ మూడు కిలోల నుంచి 5కిలోల వరకు బరువు వచ్చిందన్నారు. లోపలి భాగం ఎరుపురంగులోకి మారలేదన్నారు. శ్రావణి సీడ్స్‌లో అడిగితే తమకు సంబంధం లేదనీ, కంపెనీ ప్రతినిధులను అడగాలని చెప్పారన్నారు. ఈ క్రమంలో వన్‌టౌన్, బత్తలపల్లి పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు అక్కడికీ ఇక్కడికీ తిప్పడం తప్ప.. న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వాలని కోరితే 'ఏం చేసుకుంటావో... చేసుకోమ'ని షాపు యాజమాన్యం చెప్పడంతో మురళి పురుగుల మందు తాగాడని వారు వాపోయారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు: కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి 31వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో పదో తరగతి పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈనెల 24, 25 తేదీల్లో విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబబునాయుడు అధ్యక్షతన జరగనున్న కలెక్టర్ల సమావేశానికి స్పష్టమైన ప్రణాళికలతో ఆయా శాఖల అధికారులు నివేదికలు అందించాలన్నారు. శనివారం స్వచ్ఛాంధ్రను పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



అర్పిత (ఫైల్)

డి.హీరేహాళ్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురడి గ్రామానికి చెందిన చిన్నారి అర్పిత (6) బుధవారం విద్యుదాఘాతంతో మరణించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిప్పేస్వామి, రూతమ్మ దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. నాలుగో సంతానమైన అర్పిత గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుండేది. బుధవారం రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చింది. ఇంటి బాత్రూంలో విద్యుత్ వైరు తెగిపోయింది. దీంతో బాత్రూం డోర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండేది. అర్పిత స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్దామని డోర్‌ను తాకగానే విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. కుమార్తె ఎంతసేపటికీ రాకపోవడంతో తల్లి రూతమ్మ బయటకి వచ్చి చూడగా.. కింద పడిపోయి కనిపించింది. రూతమ్మ గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చిన్నారిని పక్కకు తీశారు. వారి సాయంతో అర్పితను రాయదుర్గం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

డెంగీతో టీడీపీ కార్యకర్త మృతి



సురేంద్ర (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సురేంద్ర(34) డెంగీ జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పది రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండడంతో చెన్నేకొత్తపల్లిలో చికిత్సలు చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారంరోజుల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ జ్వరం లక్షణాలు ఉన్నాయని తెలిపారన్నారు. పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యూస్ బాక్స్

దరఖాస్తు చేసుకోండి

నల్లమాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్యా, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన మహిళలు ఉచిత టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు.

పరీక్షలు బాగా రాయండి

తనకల్లు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు కష్టపడి.. కాకుండా ఇష్టపడి చదివి పరీక్షలు రాస్తే.. మంచి మార్కులు వస్తాయని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాగా తెలిసిన వాటికి ముందుగా సమాధానాలు రాసి, తరువాత మిగిలిన వాటి గురించి ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుస్మితజ్యోష్నా, ఉపాధ్యాయులు పారేస్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ స్థానిక తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ముదిగుబ్బ మండలం సానేవారిపల్లి గ్రామానికి చెందిన ఒత్తూరు కుషీదాకు రూ.1,07,295, ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కలవకుర్తి లక్ష్మీనరసమ్మకు రూ.40వేలు చెక్కులను అందజేశారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

ధర్మవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేశ్‌బాబు తెలిపారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 56 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా.. 32 మం దిని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో సిడాప్ చైర్మన్ దీపకరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి హరికృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు పరిశీలన

గాండ్లపెంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వీధుల్లో చెత్త తొలగింపు ప్రక్రియను ఈఓఆర్డీ సునీత బుధవారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. ప్రతి ఒక్కరూ పొడి, తడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలన్నారు. ఆమె వెంటపంచాయతీ కార్యదర్శి బాషా, కార్మికులు ఉన్నారు.

నాటుసారా అనర్థాలపై అవగాహన

ముదిగుబ్బ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0లో భాగంగా మండలంలో అడవి బ్రాహ్మణపల్లి తండా, టీఎస్ పాళ్యం, రాళ్ళ అనంతపురం తండా గ్రామాల్లోని ప్రజలకు నాటుసారా అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, ధర్మవరం సబ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, ముదిగుబ్బ ఏఎస్ఐ బాబు నాయక్, నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కదిరిఅర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితా చేర్చుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామి అమలుకు కృషి చేయాలని వాల్మీకి బోయ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చామన్నారు.

పూడిక తీశారు... వదిలేశారు..

ధర్మవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదీన మసీ దు వద్ద మూడు రోజుల క్రితం పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలో పూడిక తీశారు. అనంతరం ఆ డ్రైనేజీపై మూత మూయకుండా.. ఆ పూడికనూ తొలగించకుండా అలాగే రోడ్డుపై వదిలేశారు. తద్వారా వచ్చే తీవ్ర దుర్వాసనతో ఆ ప్రాంతవాసులు, రంజాన్ మా సం కావడంతో మసీదుకు వెళ్లే ముస్లిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాలువపై శ్లాబు కూడా వేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి.. ఈ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రైనేజీపై మూత మూయకుండా.. పూడికను రోడ్డుపైనే వదిలేసిన మున్సిపల్ సిబ్బంది



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ విద్యార్థులు చేపట్టిన సాయిప్రేమకి గంగ సంగీత నృత్యరూపకం భక్తులను అలరింపచేసింది. బీహార్, జార్ఖండ భక్తులు పర్తియాత్ర పేరుతో పుట్టపర్తిలోని ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయికుల్వంతు సభామండపంలో సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

మంత్రి ఇలాకాలో అక్రమాలు పట్టించుకోరా..!

ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ, బాధితుల ధర్నా

ధర్మవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మంత్రి సత్యకుమార్ ఇలాకాలో.. 650-2 సర్వేనెంబరులో రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమార్కులు పాలైందని ధర్నాలు చేస్తున్నా.. పట్టించుకునేవారే లేరా అని సీపీఐ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముసుగు మధు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, ప్లంబర్లు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పేదల పేర్లు చెప్పుకుని ప్లంబర్ల యూనియన్ నాయకులు, వైసీపీ నాయకులు కుమ్మక్కై ఆ భూమిని అర్హులైన వారికి అందకుండా బినామీ పేర్లతో ఆ భూమిని నొక్కేశారన్నారు. వీరికి నాటి తహసీల్దార్ రమేశ్ పూర్తిగా సహకరించారన్నారు. యూనియన్ పేరు చెప్పుకుని ముగ్గురు వ్యక్తులు దాదాపు 30 నుంచి 35 పట్టాలు బినామీ పేర్లతో దోచేశారన్నారు. అప్పటి అధికార పార్టీ వైసీపీ సహకరించినందుకు నజరానాగా నాటి ఎమ్మెల్యే కేతిరెడ్డి అనుచరులకు కూడా 10 పట్టాలు అప్పనంగా ఇచ్చేశారని ఆరోపించారు. ఈ అవినీతిపై ఇంతగా ఆందోళన చేసున్నా... మంత్రి, అధికారులు పట్టించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. విధులకు వెళ్లకుండా రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ నటరాజ్ అక్కడికి వచ్చారు. విచారణ జరిపి బోగస్ అని తేలితే కేసులు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు రవికుమార్, రమణ, చేనేత నాయకులు పోలా లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, సకలరాజ, పెద్దన్న, నాగభూషణ, ప్లంబర్స్ గోవిందురాజు, తాజ్, సుబ్బయ్య, రామకృష్ణ, శ్రీరాములు, నాగరాజు, మనోహర్, బాబావలి, మసూద్, మస్తాన్, కేశవ, రామాంజి, రమేశ్ పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న సీపీఐ నాయకులు, బాధితులు

ముదిగుబ్బ ఎంపీపీపై సీఎంకు ఫిర్యాదు

ముదిగుబ్బ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ముదిగు బ్బ మండల ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌పై అమరావతిలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం తాను ఫిర్యాదు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లి తం డా గిరిజనుల భూ సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ హయాంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, వైసీపీకి చెందిన సి.ప్రభాకర్ రెడ్డి, యం.శాంతమ్మ, సి.సుకన్య ముదిగుబ్బ మండలంలో గిరిజనుల సాగులో ఉన్న దాదాపు 200 ఎకరాలను వారి పేర్ల మీద నమోదు చేయించుకున్నారని వివరించామన్నారు. అలాగే చిలమత్తూరు మండలం సోమగుట్ట రెవెన్యూ గ్రామ పొలంలో సర్వే నెంబర్ 24 నుంచి 34 వరకు దళితులు, బీసీలకు కేటాయించిన అసైన్డ్ భూములు దాదాపు 73 ఎకరాలను ముదిగుబ్బ ఎంపీపీ తన కుటుంబ సభ్యుల పేరు మీద నమోదు చేయించుకున్నారని, బ్యాంకుల ద్వారా లోన్లు కూడా పొందారని తెలిపామన్నారు. అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజన భూ సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు వివరించారు. రెవెన్యూ శాఖ ద్వారా నివేదిక తెప్పించుకొని, తగు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న రామకృష్ణ



ధర్మవరం : పోస్టర్ విడుదల చేస్తున్న చిలకం, నాయకులు

పిఠాపురం బహిరంగ సభకు తరలిరండి

ధర్మవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభను కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. పిఠాపురం మహాసభకు తరలివచ్చే నాయకులు, కార్యకర్తల కోసం బస్సు, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుల రమేశ్, రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకేపవన్ కుమార్, పెనుకొండ నాయకులు కుమార్, మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, నాయకులు మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : పిఠాపురంలో శుక్రవారం నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ భైరవప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్‌అండ్‌బీ భవనంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో నాయకులు చలపతి, లక్ష్మణ్, రమణ, ఆంజిబాబు, రాజేంద్రప్రసాద్, అరవిందు, రాజేంద్ర, గణేష్‌నాయక్, గంగరాజు, శివశంకర్ పాల్గొన్నారు.

ఆలయ మాజీ కమిటీ సభ్యులకు సన్మానం



ఆలయ మాజీ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ముదిగుబ్బ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఊరులోని గ్రామదేవత పెద్దమ్మతల్లికి శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజులపాటు జాతరను ఘనంగా నిర్వహించిన నాటి ఆలయ కమిటీ సభ్యులను గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. కాగా ఏటా ఈ ఉత్సవాలను అనంతరం ఆ ఆలయ కమిటీ సభ్యుల గడువు ముగిస్తుంది. నూతన కమిటీని ఎన్నికోవాల్సి ఉంది. ఈ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించారని ఆలయ మాజీ కమిటీ సభ్యులు మల్లాగుండ్ల కిరణ్‌కుమార్, అన్నమనేని దామోదర్ నాయుడిని సన్మానించారు.

వీధిలైట్ల కనెక్షన్ మార్పు

ధర్మవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాధవవీధిలో వీధిలైట్లు 24 గంటలూ వెలుగూ ఉండేవి. దీంతో మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లు అధికంగా వస్తోందని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ అద్రమహేశ్ నియోజకవర్గ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పరిటాల శ్రీరామ్ వెంటనే సమస్యను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ సిబ్బందిని పంపి.. వీధిలైట్ల కనెక్షన్లను మార్పించారు.



వీధిలైట్ల కనెక్షన్ మార్చుతున్న సిబ్బంది

ఆరుతడి పంటలతో ఆదాయం బాగు: కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

బుక్కపట్నం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వరి పంటకు బదులు.. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, చిరుధాన్యాలు, కూరగాయలు సాగుచేస్తే భూగర్భ జలాలు పొదుపు చేయడంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని సిద్దరాంపురంలో ఈక్రాప్ నమోదు, రబీలో సూపర్ చెక్ కార్యక్రమం అమలును జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, రైతులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పలు పొలాలను పరిశీలించారు. ఏ పంటకైనా భూమి సారాన్ని బట్టి ఎరువులు వినియోగించాలన్నారు. ఎక్కువగా ఎరువులు వాడకం వలన కలిగే నష్టాలను రైతులకు వివరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఏయే పంటలు సాగుచేయాలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వారి వెంట ఏడీ స్వయంప్రభ, తహసీల్దార్ షబుద్దీన్, ఏఓ సతీష్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది గంగాధర్, సుధాకర్‌నాయక్, వీఆర్‌ఓలు సురేష్ ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



ట్రోఫీని అందజేస్తున్న డీఎస్పీ

కొత్తచెరువు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చైతన్య పాఠశాలల వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎస్‌రావు జ్ఞాపకార్థం జిల్లాలోని వారి పాఠశాలల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. స్థానిక చైతన్య పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కళాశాల ఏజీఎం సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... డాక్టర్ బీఎస్‌రావు చైతన్య పాఠశాలను దేశవ్యాప్తంగా నెలకొల్పి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని, ఆ విద్యాసంస్థల ద్వారా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ఆయన మరణించినా ఆయన పేరు మీద క్రీడలను నిర్వహిస్తుండటం హర్షించతగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలక్రిష్ణ, సిబ్బంది మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రోహిణి, శ్రీనివాస్, కో-ఆర్డినేటర్లు ఇర్షాద్, అనిత, సబిత, ఏఓలు నాగరాజు, ప్రభాకర్‌రెడ్డి, జోనల్ పీఈటీ విజయ్‌కుమార్, నరేంద్ర, కవిత పాల్గొన్నారు.

కాటమయ్య స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బత్తలపల్లి మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం కాటమయ్యస్వామి బ్రహ్మోత్సవాలు రెడ్డివారి బోనాలు సమర్పించడంతో బుధవారం ప్రారంభమయ్యాయి. కాటమయ్యస్వామికి రెడ్డివారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ధ్వజారోహణ చేశారు. కాటమయ్యస్వామి ప్రభ ముస్టురు నుంచి కాటమ య్య కొండకు చేరుకుంది. కార్యక్రమంలో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

బత్తలపల్లి మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ నిర్వహించారు. పాఠశాలలో ప ని చేసి ఉద్యోగ విరమణ పొందిన టీచర్ మారుతి రూ. 10వేల విలువైన అట్టలు, పెన్నులను విద్యార్థినులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జయంతి, టీచర్లు పద్మావతి, మారుతి, స్వరాజ్యలక్ష్మి, జ్యోతి, సరిత, జయలక్ష్మి, శాంతకుమారి, షమితాగ్‌బేగం, శరణ్య, భారతి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● నల్లమాడ : మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పది విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంషీద్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఆయూబ్‌బాషా, సోముశేఖర్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, బాబునాయక్, యాసిన్, మహమ్మద్, ఫైరోజ్‌బాషా, చంద్రనాయక్, వీవీఎస్ దేవి పాల్గొన్నారు.



బత్తలపల్లిలో విద్యార్థినులతో టీచర్లు



రెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్రైం న్యూస్..

రూ.లక్ష విలువైన కేబుల్ వైరు చోరీ

ధర్మవరంరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్వంపల్లి గ్రామంలో దొంగలు మంగళవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. రైతుల పొలాలే టార్గెట్‌గా దొంగలు స్టార్టర్‌పెట్టె నుంచి బోరులోకి వెళ్లే కేబుల్‌వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లారు. సుమారు రూ. లక్ష విలువైన కేబుల్ వైర్ చోరీకి గురైందని బాధిత రైతులు ఓబిలేసు, బాలనారాయణస్వామి, బిల్లురాజు, బిల్లు నరసప్ప వాపోయారు. అలాగే గ్రామసమీపాన రహదారి అనుకొని ఉన్న పంచాయతీ బోరుకు ఉన్న కేబుల్‌ను దుండగులు చోరీ చేశారు. ఎండకాలం సమీపిస్తున్న తరుణంలో పొలాలకు నీరు పెట్టుకునేందుకు వీలు లేకుండా చేశారని ఆ రైతులు విలపించారు. గతనెల 17న అర్ధరాత్రి సుమారు 10మంది రైతులకు సంబంధించి కేబుల్ చోరీ అయింది. రైతులంతా కలిసి మళ్లీ కేబుల్ వైరును అమర్చుకోవడంతో మళ్లీ మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు వాపోయారు. గతంలో ఈ చోరీలపై పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకవడంతో దొంగతనాలు ఇలా పెరిగిపోతున్నాయన్నారు.



బోరు కేబుల్ వైరు కట్ చేశారని చూపుతున్న రైతు ఓబిలేసు

నిమ్మలకుంటలో రస్తా వివాదం



రహదారికి అడ్డంగా వేసిన దుంగలు

ధర్మవరం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంటలో బుధవారం ఇరువర్గాల మధ్య రస్తా వివాదం నెలకొంది. రహదారిలో ఎవరూ వెళ్లకుండా కట్టెలు, టెంకాయ దుంగలు అడ్డు వేశారు. గ్రామానికి చెందిన బళ్లారి వెంకటరమణప్ప, వెంకటరమణ కలిసి సర్వేనెంబర్ 214-1, శింగంశెట్టి వంశస్థులు 214-2 సర్వే నెంబర్లలో స్థలాన్ని కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. శిం గం శెట్టి వంశస్థులు రామాంజినేయులు, లక్ష్మీనారాయణతో పాటు పలువురు ఇళ్లవద్దకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేసుకున్నారు. అయితే శింగంశెట్టి వంశస్థులకు తన సర్వేనెంబర్‌లో రహదారి లేదని... రహదారికి దుంగలు అడ్డంగా వేశాడు. దీంతో వారు ఇరువురు తహసీల్దార్ నటరాజ, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేసి రహదారికి అడ్డంగా ఉన్న దుంగలు తీసేయించారు.

నగదు స్వాహాపై కేసు

గాండ్లపెంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగదు స్వాహాపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చామాలగొంది పంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లికి చెందిన పూజారి సరస్వతి కుమార్తె అరబ్ దేశాల్లో ఉంటోంది. సరస్వతికి చదువురాకపోవడంతో రెడ్డివారిపల్లి చెందిన మల్లికార్జున ఎస్‌బీఐలో ఆమె పేరుతో అకౌంట్ ఓపెన్ చేయించాడు. సెల్ నంబర్ మాత్రం మల్లికార్జునదే ఇచ్చాడు. దీంతో ఆమె అకౌంట్‌ను ఇతని సెల్ నెంబర్‌తో అనుసంధానం చేసుకున్నాడు. సరస్వతి కుమార్తె పంపే డబ్బులను మొదట్లో మల్లికార్జున డ్రా చేసి ఇచ్చేవాడు. అనంతరం దాదాపు రూ.రెండు లక్షలదాకా సొమ్ము కాజేశాడు. ఆలస్యంగా విషయాన్ని తెలుసుకున్న సరస్వతి.. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

నలుగురిపై కేసు నమోదు

కదిరిఅర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపల్లిలో ఆదిలక్ష్మమ్మ, నరసింహులు ఆవుకు గడ్డి విషయంలో బుధవారం గొడవపడ్డారు. నరసింహులు, అతని కుటుంబ సభ్యులు గంగరాజు, వినోద్, ఆనంద్ ఆమెపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి తమ్ముడు ఏపరాల ఎర్రదొడ్డి ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరంరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సీతారంపల్లి వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా బెంగుళూర్‌కు తరలిస్తున్న 76 (ఒక్కోటి 50 కేజీలు) బస్తాలను రూరల్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై సీతారాంపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ బొలెరో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి.. ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి యత్నించారన్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని, రేషన్ బియ్యం, వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని అన్నారు. నిందితులు సోమందెపల్లికు చెందిన వారిని, వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి గీతావాణి



మాట్లాడుతున్న న్యాయాధికారి గీతావాణి

ధర్మవరం రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ధర్మవరం కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వాల్మీకి ఫంక్షన్ హాల్ నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఇందులో మండలంలోని 30 గ్రామాలకు సంబంధించి 345 మంది మహిళసభ్యులు పాల్గొన్నారు. ఇందులో న్యాయాధికారి మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మహిళసంఘం సభ్యులకు ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. 2వ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేశారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ మాధవి, అడ్వకేట్లు బాలసుందరి, సుమలత, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏఎఫ్ ఎకాలజీ కో-ఆర్డినేటర్ రిజ్వాన, అరుణ, ఎంటీఎల్ దస్తగిరి, సీడీపీఓ లక్ష్మీ, పోస్ట్ ఉమెన్ సూర్యకల, కానిస్టేబుల్ నాగరత్నమ్మ, విష్ణు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

నంబులపూలకుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పునడింపల్లి, కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 85 మంది విద్యార్థులకు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సమీవుల్లా రూ. 10 వేల విలువైన అట్టలు, పెన్నులు బుధవారం పంపిణీ చేశాడు. ఇందులో హెచ్‌ఎం మురళి, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అట్టలు, పెన్నులు అందజేస్తున్న సమీవుల్లా

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీ భవన నిర్మాణం అడ్డగింత

వైసీపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు



శెట్టిపల్లిలో అంగన్‌వాడీ భవన పనులను అడ్డుకుంటున్న వైసీపీ నాయకులు, కుటుంబ సభ్యులు

పెనుకొండ రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): దాతలు ఇచ్చిన స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాన్ని చేపట్టకుండా వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి అడ్డుకున్నారు. దీంతో అధికారులు, దాతలు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పెనుకొండ మండలం శెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని బొజ్జిరెడ్డిపల్లిలో వెంకోబరావు అనే వ్యక్తి కూతురు పేరిట సర్వే నంబరు 28-2లో 28 సెంట్ల శోత్రియం భూమి ఉంది. శెట్టిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు ఈ భూమిని తన భార్య పేరిట 2021లో బుక్కపట్నంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. విషయం తెలుసుకున్న వెంకోబరావు కూతురు సరోజమ్మ, కుమారుడు చలపతిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో సర్వే చేసి బాధితులకు భూమిని అప్పగించారు. అందులో పది సెంట్ల స్థలాన్ని వెంకోబరావు కుటుంబం మోడల్ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి దానంగా ఇచ్చింది. సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీన్ని వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి తన అనుచరులు, మహిళలను పంపి అడ్డుకున్నారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెరుగైన సేవలే లక్ష్యం

కెనరా బ్యాంకు ఏజీఎం లారెన్స్



మాట్లాడుతున్న లారెన్స్

చిలమత్తూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని కెనరా బ్యాంకు ఏజీఎం లారెన్స్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖాతాదారులతో కలిసి బ్యాంకు సిబ్బంది బుధవారం స్వర్ణోత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏజీఎం హాజరై మాట్లాడారు. 1975 మార్చి 12న బ్రాంచ్ ప్రారంభమై మండల ప్రజలకు విలువైన సేవలను అందిస్తోందన్నారు. 27 వేలమంది ఖాతాదారులు ఉన్నారని, ఇందులో 6వేల మందికి పైగా రైతులకు రుణ సదుపాయం కల్పించబడిందన్నారు. అదేవిధంగా విద్య, వ్యాపారం, చిన్న పరిశ్రమలు, బంగారు రుణాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. డబ్బున్న వారి నుంచి డిపాజిట్లు సేకరించి అవసరం ఉన్న వారికి సమకూర్చడమే బ్యాంకు ఉద్దేశ్యమన్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తూ మరింత మందికి రుణసదుపాయం కల్పించే విధంగా ఖాతాదారులు నడుచుకోవాలన్నారు. బ్యాంకు మేనేజర్ షాజుద్దీన్ మాట్లాడుతూ తక్కువ వడ్డీకే విద్యా రుణాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలను ఖాతాదారులకు అందివ్వడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఫణి, మహేష్ గౌడ్, క్రిష్ణవేణి, వాణి, సింగరాయ, రవీంద్రానాథ్, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



సామగ్రితో విద్యార్థులు

పరిగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరిటాల యువసేన ఆధ్వర్యంలో బుధవారం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు పంపిణీ చేశారు. మోద ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.2వేలు ఇవ్వాలని సర్పంచ్ బాలాజీ నగదును హెచ్ఎం ఉమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో జేసీబీ చౌడప్ప, నాగరాజు, మహేష్, అశోక్, సురేష్, పరిటాల శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్

గుడిబండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎన్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గుడిబండ కెనరా బ్యాంకు మేనేజర్ నల్లయ్య ఆర్ఓ ప్లాంట్‌ను వితరణ చేశారు. విద్యార్థులు నీటి కోసం ఇబ్బందిపడుతుండటాన్ని తెలుసుకున్న మేనేజర్ రూ.90వేలు విలువచేసే ఆర్ఓప్లాంట్‌ను అందించి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సాయి సిద్దార్థ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, చైర్మన్ రాధమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గుడిబండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్లస్టర్ చైర్మన్ గోవిందప్పకు ఉపాధ్యాయులు బుధవారం విన్నవించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉదయం పాఠశాల, మధ్యాహ్నం నైపుణ్యాల శిక్షణ ఉంటుండటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని మూడ్ల గిరియప్ప, నరసింహప్ప, కేజే రెడ్డి, నాగరాజు, చంద్రమౌళి తదితరులు కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె..!

- ఉమ్మడి జిల్లాలో 15 పాఠశాలలు, 12 కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఐదో తరగతికి 1200సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం 1120 సీట్ల భర్తీకి ఏర్పాట్లు
- నేటితో ముగియనున్న గడువు



మలుగూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

హిందూపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో బోధన అందించేందుకుగాను 2025-26సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రవేశాలకు ప్రక్రియ సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం గురుకులాలను మరింత బలోపేతం చేసేందుకు పూనుకుంది. ఉమ్మడి జిల్లాలో 5వ తరగతికి సంబంధించి 15పాఠశాలలు, ఇంటర్ మొదటి సంవత్సరానికి 12 కళాశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతికి ఆన్‌లైన్‌లో ప్రక్రియ ప్రారంభమైంది. 5వ తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఉచిత విద్య వసతిని పొందే అవకాశం ఉంటుంది. ఐఐటీ, నీట్ అకాడమి శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశాలకు గురువారం వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5వ తరగతి ప్రవేశాలకు 1200సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 1120సీట్లను భర్తీ చేయనున్నారు. ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థులు కళాశాలలో కూడా 80మంది విద్యార్థులు చొప్పున అవకాశం కల్పించనున్నారు.

అనంత జిల్లాలో..

5వ తరగతి విద్యార్థులకు కురుగుంట బాలికలు ఇంటర్ సీఈసీ గ్రూపు, తిమ్మాపురం, ఉరవకొండ, గుత్తి, బ్రహ్మసముద్రం బాలికలు 5వ తరగతి, ఇంటర్ సీఈసీ, హెచ్ఈసీ, కొర్రపాడు బాలికలు 5వ తరగతి మాత్రమే. డాక్టర్ బ్రెసెస్ జూనియర్‌కళాశాల బాలికలు ఇంటర్ మాత్రమే 160సీట్లు, కణేకల్ బాలురు, పప్పూరు బాలురు 5వ తరగతి, ఇంటర్.

శ్రీసత్యసాయి జిల్లాలో..

కాలసముద్రం, మలుగూరు బాలురు 5వ తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, నల్లమాడ బాలికలు 5వ తరగతి, ఇంటర్ సీఈసీ, హెచ్ఈసీ, అమరాపురం, హిందూపురం బాలికలు 5వ తరగతి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, రొళ్ల, హిందూపురం బాలుర 5వ తరగతి మాత్రమే.

నిబంధనలు

5వ తరగతిలో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012సెప్టెంబరు 1నుంచి 2016ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్, క్రిస్టియన్(బీసీసీ) విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య పుట్టినవారై ఉండాలి. జూనియర్ ఇంటర్‌లో చేరేవారు 2024-25ఏడాదిలో పదవ తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. 5వ తరగతి ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రులకు ఏడాదికి ఆదాయం రూ.లక్షకు మించకూడదు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక పాఠశాలలో 5వ తరగతికి 80సీట్లు, కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 80సీట్లు ఉంటాయి.

అవసరమైన ధ్రువపత్రాలు

విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఇంతకు ముందు తరగతికి సంబంధించి ధృవపత్రం ఉండాలి. దీంతోపాటు మొబైల్ నంబరు తప్పులేకుండా నమోదు చేయాలి. ప్రతిభా పరీక్షలో మెరిట్ జాబితా ప్రకారం నేరుగా సీటు కేటాయిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఏటా ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తుంటాం. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తాం. 5వ తరగతి పిల్లలందరికీ సీటు రావడానికి 4వ తరగతి సిలబస్ వరకు చదివి ఉండాలి. ఇంటర్ వారికి పదవ తరగతి సిలబస్ చదివి ఉండాలి. నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశాలకోసం పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నాం. గురుకులంలో అందించే విద్యావసతి మెనూ ఆటలు, క్రీడల గురించి తెలియజేస్తున్నాం. ఒక్కసారి 5వ తరగతిలో చేరితే ఇంటర్ వరకు అక్కడే కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను పొందవచ్చు.

- సుజాత, మలుగూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

నాటి చిలుక రథమే నేటి ఖాద్రీశుడి బ్రహ్మరథం



చిన్నమ్మకు ఉయ్యాల కట్టిన ప్రదేశం



చిన్నమ్మ నివశించిన ఇల్లు

పావగడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలో ప్రతి పాల్గుణ మాసం పౌర్ణమి రోజున బ్రహ్మ రథోత్సవం జరుగుతుంది. పావగడకు చెందిన సాసుల చిన్నమ్మ చిన్ననాడు తయారు చేసిన చిలుక రథమే నేడు కదిరి పట్టణంలో బ్రహ్మరథంగా ఉందని చరిత్ర చెబుతోంది. పావగడకు సమీపంలో ఉన్న తిమ్మాపురం గ్రామంలో నాగిరెడ్డి, శీలం కొండమ్మ దంపతులకు ఆరుగురు మగ సంతానం. అయితే ఆడబిడ్డ కావాలని శీలం కొండమ్మ కదిరికి నడుచుకుంటూ వెళ్లి నృసింహుడి వద్ద వేడుకుందట. ఏడవ సంతానంగా ఆడబిడ్డ పుట్టడంతో బిడ్డకు సాసుల చిన్నమ్మగా నామకరణం చేశారు. చిన్నప్పటి నుంచి ఆమె నృసింహుడిపట్ల భక్తిభావంతో పెరుగుతూ వచ్చింది.

తిమ్మాపురం నుంచి ఓలుగండ్లకు ప్రయాణం

ఆరుగురు అన్నగార్లకు ప్రతిరోజూ భోజనం తీసుకుని నలిగానహళ్లి గ్రామం దగ్గర జొన్న తోటలకు చిన్నమ్మ వెళ్లేది. మొక్కజొన్న బెండ్లతో చిన్న రథం తయారుచేసి అందులో స్వామివారిని ఉంచి ఆడేదట. ఆమె భక్తికి పరవశించిన నృసింహుడు చిలుకల కావిలిగా వెళ్లి చిన్నమ్మకు చిలుకల రథాన్ని ప్రసాదించాడు. ఆ రథంలో పావగడవైపు ఊరేగుతుండగా ఓలుగొండ్ల నుంచి ఎద్దుల వ్యాపార నిమిత్తం పావగడకి వచ్చిన నాగిరెడ్డి ఆ రథంలో ఊరేగుతున్నది దేవత అని మొక్కాడు. చుట్టుపక్కల ఉన్నవారు ఆయన మొక్కడాన్ని చూసి ఆడదాన్ని మొక్కడం ఏంటని నవ్వారు. అప్పటి నుంచి చిన్నమ్మను తన ఇంటి కోడలుగా చేసుకుని చిత్రహింసలు పెట్టాలని నాగిరెడ్డి నిర్ణయించుకున్నాడు. నాగిరెడ్డి ఆరవకుమారుడు వెంగల్‌రెడ్డితో చిన్నమ్మకు వివాహం చేశారు. అప్పటి నుంచి నాగిరెడ్డి, అతడి కుమారులు ఆమెను చిత్రహింసలు పెట్టేవారు. తనను ఇంత బాధపెడుతున్నా తన తల్లిదండ్రులు, అన్నలు తన పరిస్థితిని అర్థంచేసుకోలేదని ఆ కుటుంబాన్ని శపించింది. అప్పటి నుంచి ఆ కుటుంబంలో వికలాంగులు పుడుతుండటం ఇప్పటికి జరుగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

చిలకల రథంలో కదిరికి..

ఒకనొక సందర్భంలో నాగిరెడ్డి, అతడి కొడుకులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తమ అనారోగ్యం తగ్గిపోవాలని నృసింహుడికి వేడుకోగా తన సన్నిధికి చిన్నమ్మను తీసుకురావాలని వారిని స్వామివారు ఆజ్ఞాపించాడు. దీంతో వారు చిన్నమ్మను బతిమలాడగా పావగడలో తన చిలకల రథాన్ని కోనేటిలో ఉంచానని అందులోనే కదిరి దాకా ఊరేగుతానని ఆమె వారితో చెప్పింది. అనుకున్నట్లే మడకశిర, ఫులగంపల్లి మీదుగా కదిరికి రథంలో చేరి స్వామివారిని దర్శించుకుంది. ఆ రథమే ఇప్పటి బ్రహ్మరథంగా విరాజిల్లుతోంది. ఇప్పటికీ పావగడకు చెందిన ఆడబిడ్డలు వచ్చి రథాన్ని ముడితేనే బ్రహ్మరథం ముందుకు సాగే సాంప్రదాయం ఉంది. ఇప్పటికీ పావగడలో చిన్నమ్మ భక్తిని నాటకాల రూపంలో కళాకారులు చాటుతూవుంటారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజ అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు

అగళి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజను ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 17న టెన్త్ పరీక్షల ప్రారంభం కానున్న నేథ్యంలో సరస్వతిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ శ్యామ్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

గోరంట్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పాలే జయరాంనాయక్, వైసీపీ నాయకులు వీరనారాయణరెడ్డి, మేదర శంకర్ పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ఉషశ్రీచరణ్

తపాలా జీవిత బీమాతో లబ్ధి

పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్

మడకశిర టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా జీవిత బీమా వల్ల తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బోనస్ పొందేందుకు వీలు ఉందని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో నియోజకవర్గ పరిధిలోని పోస్టుమాస్టర్లు, సబ్‌పోస్టుమాస్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐపై అవగాహన పెంపొందించాలని, బీమా రక్షణ రూ.10లక్షల వరకు ఉంటుందని, ఆదాయపు పన్ను రాయితీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఏ పోస్టాఫీసులో అయినా చెల్లించవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ప్రీమియం చెల్లించవచ్చని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు



రొళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ రవిచంద్రయాదవ్‌ను బుధవారం కుంచిటిగ వక్కలిగ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప కలిశారు. విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలోని ఓ హోటల్‌లో బస చేసిన ఆయనను వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఉపాధి బిల్లులను జమ చేయండి'

అమరాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న తమకు రెండునెలలుగా ఖాతాల్లో బిల్లులు జమకాలేదని కూలీలు హనుమంతరాయప్ప, శివన్న, నింగరాజు, మూర్కణ్ణ, మల్లేశప్ప, పుట్టన్న వాపోయారు. రెండు నెలలుగా బిల్లులు జమకాకపోతే ఏవిధంగా జీవనాన్ని సాగించాలని వారు ప్రశ్నించారు. భార్యాపిల్లలు పస్తులుండాల్సిన స్థితి నెలకొందన్నారు. వెంటనే అధికారులు స్పందించి తమ ఖాతాల్లోకి బిల్లులను జమ చేయాలని వారు కోరారు.

అన్యమత ప్రచారం చేయకండి: వీహెచ్‌పీ

సోమందేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడివద్ద కొందరు ప్రచారం చేయడాన్ని గమనించిన వీహెచ్‌పీ నాయకులు బుధవారం వారిని అడ్డుకున్నారు. అన్యమత ప్రచారం చేయకండని హితవుపలికారు. అయితే మత్తుపదార్థాల బానిసత్వం నుంచి ప్రజలకు అవగాహన కల్పించడానికి కాశ్మీర్ టు కన్యాకుమారి యాత్ర చేపట్టినట్లు వారు తెలపడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు.

నిలకడగా చింతపండు ధరలు

హిందూపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు బుధవారం 1573 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. మేలురకం కర్పూలి ధర తగ్గినా రెండో, మూడో రకం ధరలు నిలకడా ఉన్నాయి. మేలురకం కర్పూలి క్వింటాల్ రూ.33వేలు ధర పలకగా రెండోరకం రూ.15వేలు, మూడో రకం రూ.8వేలు పలికాయి. అదేవిధంగా మార్కెట్‌కు వచ్చిన ఫ్లవర్‌రకాల్లో మొదటి రకం రూ.13వేలు, రెండో రకం రూ.6 వేలు, మూడో రకం రూ.4,300పలికాయి.

జయప్రదం చేయండి

చిలమత్తూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని, అయితే వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉండిపోయాయన్నారు. వైసీపీ హయాంలో కార్మికుల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఎంతో ఆశతో ఉన్నారని, అయితే పరిస్థితి మారలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టామన్నారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొని తమ డిమాండ్లను సాధించుకునేందుకు కదలిరావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రామచంద్ర, లక్ష్మీనారాయణ, గౌస్, చలపతి, రఫీక్, నరసింహప్ప, నాగప్ప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కొత్త ఎమ్మార్పీతోనే అమ్మకాలు'

సోమందేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైన్‌షాపులకు సరఫరా అవుతున్న మద్యానికి సంబంధించి కొత్త ఎమ్మార్పీ బిల్లింగ్‌లో ఉన్నట్లు సీఐ సృజన్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో లైసెన్సులకు 20శాతం మార్జిన్ రావాల్సిఉండగా 10శాతం మాత్రమే లభిస్తున్నందున ప్రభుత్వం మార్జిన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. దీని ఫలితంగా రూ.99 లిక్కర్ మినహా అన్ని బ్రాండ్ బాటిళ్లపై రూ.10 పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. అయితే కొత్త రేట్లకు సంబంధించి లేబుళ్లు అందుబాటులోకి రాలేదన్నారు. దీంతో మద్యం షాపుల్లో కొత్త ధరలతో ప్రైస్ లిస్ట్ డిస్‌ప్లేలో ఉంచడం జరిగిందని, ఇది తెలియని కొనుగోలుదారులు రూ.10 పెంచి అమ్ముతున్నట్లు అపోహపడుతున్నారన్నారు. ప్రైస్‌లిస్ట్‌కు మించి అమ్మకాలు జరిపితే 9440902566కు సమాచారం అందించాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి : ఎంపీడీఓ

అగళి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ యాదవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రత్యేకంగా ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ మినహా అన్ని కులాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18-50 సంవత్సరాల వయసున మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషను అందించడం జరుగుతుందన్నారు. 75శాతం హాజరు ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనెల 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నమోదు చేసుకోండి: ఏఓ

అగళి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైతులు గుర్తింపు నమోదు ప్రక్రియను చేయించుకోవాలని ఏఓ శేఖర్‌నాయక్ సూచించారు. మండలంలో ఇప్పటివరకు 4227మంది రైతులు చేయించుకున్నారని, మిగిలిన వారు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని మధుడి, ఇనగలూరు, అగళి, ఇరిగేపల్లి గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ మారమతమ్మ, ఎంపీఈఓ ప్రశాంత్, వీఐఏ శివప్రియ, జడ్పీఎన్ఎస్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠాపన

అగళి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరసనపల్లి గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి, గణపతి స్వామి గాలిగోపుర ప్రతిష్ఠాపన వైభవంగా సాగింది. వేద పండితులు ఈ సందర్భంగా హోమాలను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేడుకకు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో రొళ్ల టీడీపీ కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు సునీల్, రంగారెడ్డి లింగరాజు పాల్గొన్నారు.